ఎంపీ డా.లక్ష్మణ్‌కు సన్మానం



ఎంపీ లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న హరిగౌడ్

సైదాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ కళ్యాణ్‌నగర్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లింగాల హరిగౌడ్ ఇంటికి ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ విచ్చేశారు. లక్ష్మణ్‌ను హరిగౌడ్ కుటుంబసభ్యులు సన్మానించారు. అందరూ కలిసి భోజనం చేశారు. లక్ష్మణ్ వచ్చారన్న విషయం తెలుసుకున్న నియోజకవర్గం బీజేపీ నాయకులు హరిగౌడ్ ఇంటికి భారీగా తరలివచ్చారు. వారందరితో లక్ష్మణ్ పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



లక్ష కుంకుమార్చనలో త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి పూజలు

వైభవంగా లక్ష కుంకుమార్చన

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వాసవీకాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో మహాలక్ష్మి యాగం వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులనుద్దేశించి త్రిదండి దేవనాథ రామానుజ జీయర్‌స్వామి అనుగ్రహ భాషణం చేశారు. మంగళ సౌభాగ్యాల కోసం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. మధ్యాహ్నం ప్రధాన యాగశాలలో మహాలక్ష్మి యాగ నిత్య పూర్ణాహుతి అనంతరం ఇష్టి యజ్ఞ పూర్ణాహుతి చేశారు. వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో లక్ష వత్తుల దీపోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. సాయంకాల నిత్యపూర్ణాహుతితో ఈ కార్యక్రమాలు ముగిశాయి.

శివాలయం హుండీ ఆదాయం రూ.34వేలు



హుండీ డబ్బు లెక్కిస్తున్న సిబ్బంది

సరూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం హుండీని డబ్బును మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ టేకుల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. గడిచిన ఏడాదికి సంబంధించి భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న మొత్తం రూ.34,345గా తేలింది. సదరు మొత్తాన్ని ఆలయ నిర్వహణ నిమిత్తం బ్యాంకు ఖాతాలో జమచేయాల్సిందిగా ఆలయ మేనేజర్ సీహెచ్.శ్రీనివాస్‌రావుకు సూచిస్తూ ఈవో శ్రీనివాస్‌రెడ్డి ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు ఇక్కె మాధవీశ్రీనివాస్, కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, పగడాల ఉమేశ్, ఆలయ అర్చకుడు దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ గోపి పాల్గొన్నారు.



ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి

ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాలి

సరూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎంత డబ్బు సంపాదించినా దాంతో ఆరోగ్యాన్ని మాత్రం కొనలేమని, ఈ దృష్ట్యా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పదిలంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉన్నదని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కళాశాల ఆవరణలో ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్లతో కలిసి ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. అదే విధంగా ఇక్కడ ఏర్పాటు చేసిన యోగా తరగతులను, ఫిట్‌నెస్ శిబిరాన్ని సైతం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సీటీవో భగత్, అసిస్టెంట్ ప్రొఫెసర్ యలమంద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధరాత్రి మహిళపై హత్యాయత్నం

గతంలో విచారణ పేరుతో పోలీసులు దాడిచేశారని ఆరోపించింది ఈమే

కొత్తపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఓ మహిళపై గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేశారు. ఈ హత్యాయత్నం ఘటన ఎల్‌బీనగర్ పీఎస్ పరిధిలో అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బాలాపూర్ బడంగ్‌పేట, సబితాఇంద్రారెడ్డి నగర్‌లో ఉండే వర్త్యా లక్ష్మి(40) ఈ నెల 7వ తేదీ రాత్రి 11.45 గంటలకు ఎల్‌బీనగర్ రిషికిచెన్ వెనుక సరూర్‌నగర్ దారిలో కొందరు మహిళలతో వేచి ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు అక్కడికి చేరుకుని లక్ష్మిపై కత్తులతో ఆమె యదపైనా, ముఖంపైనా, కడుపులో పొడిచి పరారయ్యారు. అర్ధరాత్రి 12 గంటలకు లక్ష్మి రక్తపు మడుగులో పడి ఉందని ఓ రిక్షాడ్రైవర్ దిల్‌సుఖ్‌నగర్ కృతిక ఆస్పత్రిలో మార్కెటింగ్ పనిచేసే ఆమె అల్లుడు పానుగోతు బాబుకు సమాచారం ఇచ్చాడు. వారు చికిత్స నిమిత్తం బాధితురాలిని కృతిక ఆస్పత్రికి తరలించారు. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటలకు సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి, సంఘటన స్థలానికి చేరుకుని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తూ వివరాలు సేకరించారు. పానుగోతు బాబు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు. అర్ధరాత్రి సదరు మహిళ అక్కడ ఎందుకు ఎవరి కోసం వేచి ఉందనే విషయంపైనా దర్యాప్తు చేస్తున్నారు.

2023లో సంచలనం సృష్టించిన కేసులో ...

2023లో సంచలనం సృష్టించిన కేసది. ఇద్దరు ఎల్‌బీనగర్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌కేసులో ఆరోపించింది ఈ మహిళేనని తెలియడంతో ప్రస్తుతం పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తుచేస్తున్నట్లు సమాచారం. ఆగస్టు 15, 2023 అర్ధరాత్రి విచారణ పేరుతో ఎల్‌బీనగర్ పోలీసులు తనను పీఎస్‌కు తరలించి విచక్షణారహితంగా దాడి చేశారని వర్త్యా లక్ష్మి అదేనెల 17న ఎల్‌బీనగర్ పీఎస్‌లో బంధువులతో కలిసి హల్‌చల్ చేసింది. సంచలనం సృష్టించిన గిరిజనమహిళ లక్ష్మిని స్టేషన్‌లో నిర్బంధించి విచారణపేరుతో హింసించారనే ఆరోపణల నేపథ్యంలో అప్పటి రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఎల్‌బీనగర్ పీఎస్‌లో విధుల్లో ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి



ఎల్లయ్య మృతదేహం

హయత్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎల్‌బీనగర్ కాకతీయనగర్ కాలనీలో నివాసం ఉండే భగత ఎల్లయ్య(52) ఆటో డ్రైవర్. మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో ఆటోలో ఎల్‌బీనగర్ వైపు నుంచి హయత్‌నగర్‌కు వస్తున్నాడు. ఆటో హయత్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకొగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎల్లయ్య తలకు బలమైన గాయాలు కాగా 108లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మధ్యాహ్నం చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ లింగారెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేసవి తరగతులు నిర్వహిస్తున్నా పట్టించుకోని ఇంటర్ బోర్డు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తరగతుల బహిష్కరణ



కార్పొరేట్ ఇంటర్ కళాశాల ఎదుట నిరసిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

చాదర్‌ఘాట్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కళాశాలల్లో వేసవి తరగతులు నిర్వహించవద్దని ఇంటర్ బోర్డు ప్రకటించినా, నిబంధనలకు విరుద్ధంగా పలు కార్పొరేట్ కళాశాలలు వేసవి తరగతులు నిర్వహిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ ఆరోపించింది. తక్షణమే ఆ కళాశాలలపై బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో వేసవి తరగతులు నిర్వహించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆయా కళాశాల్లోని తరగతులను బహిష్కరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో వేసవి తరగతులను నిర్వహిస్తున్నారని ఇంటర్ బోర్డుకు ఇచ్చిన ఫిర్యాదులపై కనీసం ఆయా కళాశాలల్లో తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇప్పటికే పలు కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు పూర్తయ్యాయని, కనీససౌకర్యాలు లేకున్నా లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బోర్డు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి నిబంధనలను పాటించని కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పాత పింఛన్ విధానాన్ని ప్రకటించాలి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాత పింఛన్ పథకం (ఓపీఎస్)ను ప్రకటించే వరకు దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలని ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి సంఘం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నగరంలో మంగళవారం పీటీఏ రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

నూతన కార్యవర్గం..

ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా కె.మల్లికార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శారద, రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శిగా శౌరి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పార్థసారథి, ప్రభాకర్, చీఫ్ ప్యాట్రన్లుగా కేఎస్ ప్రకాష్‌రావు, బద్రీ నారాయణరావు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా వరలక్ష్మి, కార్యదర్శిగా బబితాకుమారి, కోఆర్డినేటర్‌గా లావణ్య, నేషనల్ కౌన్సిలర్‌గా విక్రంభాయిని ఎన్నుకున్నారు.

అవగాహనతో రాజ్యాంగ పరిరక్షణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సామాన్యులు, యువతీ, యువకులు, విద్యార్థుల్లో రాజ్యాంగంపై తప్పనిసరిగా అవగాహన కల్పించాలని, అప్పుడే దాని స్ఫూర్తిని కాపాడుకోగలమని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా ఎవరివాటా వారికి అందజేసి, సామాజిక, ఆర్థిక అసమానతలను నిర్మూలించడానికి ప్రయత్నాలు సాగించాలని ఆకాంక్షించారు. దళిత స్త్రీశక్తి ఆధ్వర్యంలో మంగళవారం 'రాజ్యాంగ పరిరక్షణ - భవిష్యత్ ప్రణాళిక' అంశంపై సమావేశం నిర్వహించారు. విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి బీఎం.వినోద్‌కుమార్, ఆంధ్రమహిళా సభ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ వసుంధరాదేవి, ప్రొ.రజిత, భూమిక ఉమెన్స్ కలెక్టివ్ కొండవీటి సత్యవతి, కృష్ణకుమారి తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించుకోవడంలో పౌరుల పాత్ర ప్రధానం అని అన్నారు. కుల, మత, వర్గ వైషమ్యాలకు అతీతంగా సమాజంలో శాంతి, సామరస్యాలు, వర్ధిల్లాలంటే రాజ్యాంగమే శరణ్యమని వక్తలు నొక్కిచెప్పారు. దళిత స్త్రీశక్తి జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ సభాధ్యక్షతన సాగిన ఈ సభలో ఎంవీఎఫ్ ప్రతినిధి వెంకటరెడ్డి, అడ్వకేట్ ప్రకాష్, సాధన తదితరులు పాల్గొన్నారు.

● వేంకటేశ్వరస్వామికి పూజలు



సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని హైకోర్టు జడ్జి జస్టిస్ నందికొండ నర్సింగ్‌రావు సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రముఖులు, అర్చకులు స్వాగతంపలికి వేదాశీర్వచనం చేశారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



ప్రత్యంగిరాదేవిని దర్శించుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్

ప్రత్యంగిరాదేవి సన్నిధిలో నిరంజన్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం నిరంజన్‌రెడ్డికి ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, సంగమేశ్వరరావు, రాజగోపాల్, శశివర్ధన్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సరూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్ 45వ డివిజన్‌లోని శివశంకర్‌నగర్ కాలనీకి చెందిన పులిమామిడి శోభారాణి ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రి పాలయింది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ కార్పొరేటర్ అక్కి మాధవీఈశ్వర్‌గౌడ్ సహకారంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.60వేలు మంజూరయ్యాయి. ఈ చెక్కును మంగళవారం బాధితురాలి భర్త శ్రీశైలంకు మాధవీఈశ్వర్‌గౌడ్ అందజేశారు.

హెచ్‌ఎండీఏ నిధులతో పార్కు అభివృద్ధి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మల్లారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడ 3వ డివిజన్‌లోని రామిడి మల్లారెడ్డి నగర్ కాలనీలో గల 800 గజాల ఖాళీ స్థలాన్ని చక్కని పార్కుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ సరస్వతి పేర్కొన్నారు. ఇందుకు హెచ్‌ఎండీఏ నిధులు కేటాయిస్తామని ఆమె చెప్పారు. సదరు స్థలం కబ్జా కాకుండా కాపాడి అక్కడ పార్కు అభివృద్ధి చేయాలని కోరుతూ గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామిడి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్కుల అభివృద్ధిపై తాము ప్రత్యేకదృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు.

ప్రతి న్యాయవాది ఓటు హక్కును వినియోగించుకోవాలి : రవీందర్

రంగారెడ్డి జిల్లా కోర్టులు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):రంగారెడ్డి జిల్లా కోర్టుల బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం రసవత్తరంగా కొనసాగుతుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారం చేస్తూ విజయావకాశాలను మెరుగుపరచుకుంటున్నారు. ఎన్నికల అధికారి దీకొండ రవీందర్ మంగళవారం అభ్యర్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికల్లో పాటించవల్సిన నియమాలను వారికి వివరించారు. పోటీలో ఉన్న ప్రతి అభ్యర్థి ఎన్నికల నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఓటరు జాబితాలో ఉన్న ప్రతి న్యాయవాది ఈ నెల 11న జరగనున్న పోలింగ్‌లో ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సహాయ ఎన్నికల అధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణి

ఆర్‌వైవీ పథకానికి దరఖాస్తు చేసుకోండి

సరూర్‌నగర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని మీర్‌పేట్ మునిసిపల్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ సూచించారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయవచ్చునని ఆయన చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీఎస్/ఈడబ్ల్యుఎస్ వర్గాలకు చెందిన లబ్ధిదారులు తమ దరఖాస్తులను మునిసిపల్ కార్యాలయంలో పని వేళల్లో అందజేయాలని సూచించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఓల్డ్‌మలక్‌పేట ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని మలక్‌పేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణి అన్నారు. మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహిళలకు కేన్సర్, వివిధ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా మహిళలు బ్రెస్ట్ కేన్సర్, గర్భసంచి కేన్సర్‌లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అన్నిరకాల వైద్యపరీక్షలు,మందులు ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యసిబ్బంది రామేశ్వరి, కవిత, నీలిమ, రోస్లిన్, జయ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య



వెంకటరామకృష్ణ మృతదేహం

వనస్థలిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వనస్థలిపురం పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా గుంటూరు తెనాలికి చెందిన పొట్టి వెంకటరామకృష్ణ(47) మన్సూరాబాద్‌లోని చిత్రసీమ కాలనీలోని మహాలక్ష్మి రెసిడెన్సీలో భార్య, కూతురుతో కలిసి కొంతకాలంగా నివాసముంటున్నారు. అయితే వెంకటరామకృష్ణ దంపతులు కొన్ని నెలలుగా గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్యకి పాల్పడ్డాడు. మృతుడి జేబులో సూసైడ్ నోట్ ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

జిమ్ నిర్వాహకుడిపై డంబెల్‌తో దాడి

● చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి ● నిందితుడి అరెస్టు



కిషోర్ (ఫైల్)

పీర్జాదిగూడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిమ్ నిర్వాహకుడిపై డంబెల్‌తో దాడి చేసిన ఘటనలో తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందగా దాడికి పాల్పడిన నిందితుడిని మేడిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం... బోడుప్పల్ కళానగర్ కాలనీలో నివాసముంటున్న ఎరుపుల సాయి కిషోర్ (34) వీరారెడ్డి కాలనీలో జస్ట్ ఫిట్ పేరుతో జిమ్ నిర్వహిస్తున్నాడు. అదే కాలనీలో ఉంటున్న చంటి, సాయికిషోర్ స్నేహితులు. వీరిద్దరి మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. పాత కక్షలతో జరిగిన విషయాలను మనసులో పెట్టుకుని సోమవారం రాత్రి 8 గంటల సమయంలో చంటి మరో ముగ్గురితో కలిసి జిమ్‌కు వెళ్లారు. చంటి జిమ్‌లో ఉన్న డంబెల్‌ను తీసుకుని కిషోర్ తలపై విచక్షణారహితంగా దాడికి పాల్పడి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలో కిషోర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం కిషోర్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు చంటిని అరెస్టు చేయగా దాడి పాల్గొన్న మరో ఇద్దరు యువకులు పరారీలో ఉన్నట్లు సమాచారం.

ఏడాదిలో రూ.2,752 కోట్లు విడుదల

● పదేళ్లలో బీఆర్ఎస్ ఇచ్చింది రూ.3,652 కోట్లు మాత్రమే

● మేయర్ విజయలక్ష్మి



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏడాది కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీకి రూ.2,752 కోట్లు విడుదల చేసిందని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నగరాన్ని గ్లోబల్ సిటీగా తీరిదిద్దాలన్న ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో 2014 నుంచి 2023 వరకు రూ.3,652.71 కోట్ల నిధులు విడుదల చేశారని తెలిపారు. ఇందులో రాష్ట్ర ఆర్థిక కార్పొరేషన్ గ్రాంట్లు రూ.1,415.39 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1,776.53 కోట్లు, బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో రూ.460.79 కోట్లు విడుదల చేశారన్నారు. ప్రస్తుత సర్కారు 2024-25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.6,045 కోట్లు కేటాయించగా.. రూ.2,752 కోట్లు విడుదల చేసిందని పేర్కొన్నారు. ఇందులో బడ్జెట్‌లో కేటాయించిన రూ.2,965.61 కోట్లలో రూ.1552.52 కోట్లు, స్టాంప్ డ్యూటీ రూ.1150 కోట్లు, ఆర్థిక కమిషన్ గ్రాంట్లు రూ.49.36 కోట్లు ఉన్నాయన్నారు.

వెటర్నరీ డాక్టర్‌కు రూ.1.79లక్షలు టోపీ

● ఆర్మీ డాగ్స్‌కు వైద్యం చేయాలంటూ బురిడీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆర్మీడాగ్స్‌కు వైద్యం చేయాలంటూ నగరానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌ను బురిడీ కొట్టించి రూ.1.79లక్షలు సైబర్ క్రిమినల్స్ కొల్లగొట్టారు. ఆ తర్వాత మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన వెటర్నరీ డాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి తనను తాను ఆర్మీ అధికారిగా పరిచయం చేసుకున్నాడు. 'మా వద్ద ఆర్మీకి చెందిన 90 కుక్కలు ఉన్నాయి. వాటికి టీకాలు సహా.. అవసరమైన వైద్యపరీక్షలు చేయాల్సి ఉంటుంది. అందుకు అవసరమైన డబ్బును మేమే చెల్లిస్తాం..' అంటూ నమ్మించాడు. మీ ప్రొఫైల్ నచ్చిందని, ఇకపై మీరే మా కుక్కలకు వెటర్నరీ డాక్టర్ అని నమ్మబలికాడు. అయితే, ఆర్మీ నిబంధనల ప్రకారం.. మీకు చెల్లించాల్సిన డబ్బులో 50 శాతం ముందుగానే చెల్లించాల్సి ఉన్నందున పంపిస్తామంటూ వీడియోకాల్ చేసి నమ్మించాడు. మొదట మీరు కొంత నగదు బదిలీ చేయాలని, లావాదేవీ సరిగా ఉందని తేలితే మొత్తం డబ్బులు చెల్లిస్తామని నమ్మబలికాడు. అలా అతని ద్వారా డబ్బులు చెల్లింపులు చేసుకొని, అతని క్రెడిట్ కార్డులోని రూ.1.79లక్షలు కొల్లగొట్టాడు. ఎంతకీ డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఏసీపీ కాశీరెడ్డి

చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

వనస్థలిపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసే చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. వనస్థలిపురంలో శ్రీనివాస టూర్స్ అండ్ ట్రావెల్స్ వద్ద కోటా శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మధుయాస్కీగౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ రావు, లక్ష్మీగణపతి దేవాలయ కమిటీ వైస్‌చైర్మన్ మిట్టా రామ్మోహన్, న్యాయవాది రమణ రావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే అందరికీ న్యాయం

మన్సూరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని నమ్మి వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు మొగ్గు చూపుతున్నారని టీపీసీసీ ప్రచారకమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. నాగోల్ డివిజన్ నాంచారమ్మ బస్తీకి చెందిన సుమారు 50 మంది బీఆర్ఎస్ నాయకులు సోమవారం రాత్రి జరిగిన భారీ బహిరంగ సభలో బస్తీకి చెందిన జగన్నాథం, గంగయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు చేయూత



పుస్తెమెట్టెలు, చీరగాజులు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా, స్వప్న దంపతులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని నిరుపేద ఆడబిడ్డల వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ ద్వారా తమవంతుగా చేయూత ఇస్తున్నామని ఫౌండేషన్ చైర్మన్, టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్, ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడం గ్రామానికి చెందిన ప్రతాపని రమేష్, రాణి దంపతుల కుమార్తె స్వప్నకు వివాహం నిశ్చయమైంది. దీంతో మంగళవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆమెకు పుస్తెమెట్టెలు, చీరగాజులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల స్వప్నాశ్రీనివాస్ గుప్తా, ఉప్పల సాయికిరణ్, శర్వరీ దంపతులు, రాజశేఖర్ గుప్తా ఉన్నారు.

నాలుగేళ్లలో 400 పైగా సమస్యలు పరిష్కారం

అమిక మధ్యవర్తిత్వ కేంద్రం అధ్యక్షురాలు జ్యోతిరావు



మన్సూరాబాద్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థాపించిన నాలుగేళ్లలోనే 400లకు పైగా న్యాయపరమైన ఎన్నో సమస్యలను తమ సంస్థ ద్వారా పరిష్కరించామని అమిక ఆర్బిట్రియేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (అమిక మధ్యవర్తిత్వ కేంద్రం) అధ్యక్షురాలు జ్యోతిరావు పేర్కొన్నారు. సంస్థను స్థాపించి నాలుగేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎల్బీనగర్‌లోని తమ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సుప్రీం కోర్టు వారి మధ్యవర్తిత్వ ప్రాజెక్టు కమిటీ వలె తమ సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన అమిక మధ్యవర్తిత్వ కేంద్రంలో ఎందరికో శిక్షణ ఇచ్చి న్యాయపర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. న్యాయపర సమస్యలతో సతమతమయ్యే వారు సెల్: 9676875789, 7780404033 నంబర్లలో తమను సంప్రదించాలని జ్యోతిరావు సూచించారు.



బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తదితరులు - వనస్థలిపురం